# జీవిత సినిమా

*(2) శ్లో॥ 29 : ప్రకృతేర్గుణ సమ్మూఢా స్సజ్జన్తే గుణకర్మసు ।*
*తానకృత్స్న విదోమందాన్కృత్స్నవిన్న విచాలయేత్ ॥*
*(ప్రకృతి)*

**భావము :** ప్రకృతి జనిత గుణములందు చిక్కియున్న మనుషునకు ఆ గుణముల కార్యములయందే కర్మముల ప్రకారము ఆసక్తి కలిగించును. జ్ఞానులగువారు అట్టి అజ్ఞాన పరులను చలనమొందించకూడదు.

**వివరము :** కర్మప్రేరణ వలన గుణముల ప్రకారము కార్యములు చేయుట సమస్త మానవుల ఎడల నిర్మింపబడిన ప్రకృతి ధర్మము. అగ్నికి కాల్చుట ధర్మము, పాటకు రాగము ధర్మము, అట్లే మానవునకు కర్మప్రకారము కలుగు గుణముల కార్యములు చేయుట ధర్మము. *మాటకు శబ్దమునెట్లు దూరము చేయలేమో, పాటకు రాగమునెట్లు లేకుండ చేయలేమో, అట్లే కర్మబద్ధుడైన మానవున్ని ఆ కర్మ ప్రేరణవలన కలుగు గుణముల ప్రకారము కదలకుండ చేయలేము. ఇదే గీతయందు భగవంతుడు తెలియజేసిన ముఖ్యమైన ప్రకృతి ధర్మము.* ఈ ధర్మము ప్రకారము జ్ఞానియైన అజ్ఞానియైన నడవక తప్పదు.

ఒక జీవితములోని అనేక సంఘటనలు కల్గిన చలనచిత్రమును మూడు గంటలపాటు మనము చూస్తున్నాము. ఆ చిత్రములోని అనేక దుఃఖసంఘటనలు, ఎన్నో హాస్య సంఘటనలు, మరెన్నో సంతోష సంఘటనలు మొదలగు ఎన్నో విధములైన విషయములు జరుగుట చూస్తున్నాము. ఇవన్నీ తెల్లని తెరమీద చూడగల్గుచున్నాము. తెల్లని గుడ్డమీద ఇన్ని సంఘటనలు కల్గుటకు ప్రొజక్టరులోని ఫిల్ముకారణము. చిత్రములోని సంఘటనలన్ని ఫిల్ములో చిన్నగ చిత్రింపబడి ఉండి, చిత్రింపబడిన వరుస ప్రకారము తెరమీద ప్రొజక్టరు ద్వార పెద్దగ కన్పిస్తున్నాయి. హాలులో ఒక చిత్రమును మనము చూడాలంటే అందుకు అవసరము మొదటిది ఫిల్ము, రెండవది ప్రొజక్టరు, మూడవది తెల్లని పరదా(తెర). అట్లే ఒక కార్యము జరగాలంటే మొదటిది కర్మ, రెండవది గుణములు, మూడవది కర్మేంద్రియములు.

ఏ విధముగ ఫిల్మలేనిది చిత్రములేదో, అట్లే కర్మలేనిది అసలు జీవితమే లేదు. ఫిల్ము కారణముగ ఒక చిత్రమెట్లు జరుగుచున్నదో, అట్లే కర్మ కారణముగ ఒక జీవితము జరుగుచున్నది. ఫిల్ములో ఏ సంఘటనలు చిన్నగ ముద్రింపబడి ఉన్నాయో, అవియే పరదామీద కనపడుననుట జగమెరిగిన సత్యము. కాని కర్మలో ఏమి రికార్డయి ఉన్నదో, అదే కర్మేంద్రియములైన కాళ్ళు, చేతులు, నోరు మొదలగు వాటిద్వార జరుగుచున్నదనుట జగమునకు తెలియని సత్యము. హాలు, ఫిల్ము, ప్రొజక్టరు, పరదా మనకు తెలియును. కావున హాలులో ఫిల్ము ఏదైతే సినిమా అదేనని అందరికి తెలియుచున్నది. కాని కర్మ, గుణములు, శరీరము, కర్మేంద్రియముల గురించి మనకు తెలియదు. కావున శరీరములో కర్మ ఏదైతే అదే కార్యము జరుగునని మనకు తెలియక పోయినది. మనకు తెలిసిన తెలియకపోయిన ఫిల్ములోని బొమ్మయే పరదా మీదకు వచ్చి ఆడునట్లు, కర్మలోనున్న సంఘటనలే కర్మేంద్రియముల ద్వారా కార్యమై జరిగితీరును. ఈ విషయము చాలామందికి తెలియదు. కావున వారందరు జరుగుచున్న కార్యమునే చూడగల్గుచున్నారు. కాని వెనుకయున్న కర్మను చూడలేకపోవుచున్నారు.

| **(హాలులో చిత్రపద్ధతి)** | **(శరీరములో జీవిత పద్ధతి)** |
|---|---|
| ఫిల్ము | కర్మ |
| ప్రొజక్టరు | గుణములు |
| తెర (పరదా) | కర్మేంద్రియములు |
| చిత్రము | కార్యములు |
| అనుభూతి పొందువాడు ప్రేక్షకుడు | అనుభూతి పొందువాడు జీవుడు |

బాహ్యాముగ జరుగు కార్యములను మంచివి, చెడువి అను రెండుగ విభజించవచ్చును. జరుగుచున్నవి మంచివైన, చెడువైన వాటికి లోపలయున్న కర్మేయే కారణము. ఫిల్ములో ఉన్నదే పరదామీద చిత్రమైనట్లు, కర్మలో ఉన్నదే కరేంద్రియముల మీద కార్యమౌచున్నది. లోపలయున్న కర్మ మంచిదైన మంచి కార్యములు, చెడుదైన చెడు కార్యములు మానవులయందు జరుగుచుండును. ఈ విషయము ఏమాత్రము తెలియనివారు, ఒక దొంగను చూచి నీవు చెడు కార్యములు చేయుచున్నావు, ఆ పని చేయవద్దని చెప్పినప్పటికి, అతను అపుడు దొంగతనము చేయకూడదని, దానివలన పాపమొచ్చుననుకొన్నప్పటికి, రెండవమారు జరుగు కర్మవుంటే తప్పక జరిగితీరును. అలా జరిగిన కార్యము అనగ దొంగతనమును గూర్చి ఆ దొంగ నేను వద్దనుకొన్నప్పటికి తిరిగి చేశానే ఇక “నేను మంచివానిగ మారను” అని చింతించెను. తెలిసినవాడు కర్మ రహస్యము తెలుపక మంచి చెడు భేదము చూపి వానిని కలవర పెట్టకూడదు. కర్మ సిద్ధాంతమును, దేహ ధర్మములను తెలిపి, కర్మమారితే కార్యము మారునని తెలిపి, వానికి కర్మఅంటనట్లు తెల్పాలి కాని, కార్యమును గురించి చింతించునట్లు చేయకూడదని భగవంతుడు పై శ్లోకమున తెల్పాడు.